అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

- ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి
- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


రెంజల్‌లో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్/నవీపేట్/ఎడపల్లి(బోధన్): అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలను అందిస్తామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన రెంజల్, నవీపేట, ఎడపల్లిలో శనివారం పర్యవేక్షించారు. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించి.. ఆపరేట్లకు పలు సూచనలు చేశారు. ఎడపల్లిలో అన్ని శాఖల మండల అధికారులతోపాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా చోట్ల ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడి వంద రోజుల్లో పథకాలను అమలు చేస్తామన్నారు. ఒకరోజు ఆలస్యమైనా.. డేటా ఎంట్రీని పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చిందన్నారు. జనవరి చివరివారం నుంచి విద్య శాఖపై దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెరుగైన విద్య అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యేవెంట బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశకర్‌రెడ్డి, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, రెంజల్ ఎంపీపీ లోలపు రజని, ఎడపల్లి ఎంపీపీ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్, ఎంపీడీవోలు శంకర్, సయ్యద్‌సాజిద్ అలీ, గోపాలకృష్ణ, తహసీల్దార్ రాంచందర్, నవీపేట్ మాజీ ఎంపీపీ రాజేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మానాల మోహన్‌రెడ్డి, పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, మొబీన్‌ఖాన్, నాగ భూషణం రెడ్డి, సాయారెడ్డి, జావీద్, సాయిబాబాగౌడ్, గయాస్, ఇందిరారెడ్డి, మాజీ ఎంపీటీసీ కవిత, బాబులు, చిలుక అశోక్, పోచయ్య, గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, నర్సింగ్‌రావు, కిరణ్, మూస, బా బు, నారాయణచౌదరి, కోసిగి సాయిరెడ్డి, రామ్ గో పాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, లింగం, కామప్ప ఉన్నారు.

ఇంటికే ఎరువులు

ఎరువుల కొరత లేదని, సొసైటీల ద్వారా తీసుకోవాలని రైతులకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. రైతులు గ్రూపుగా ఆర్డరిస్తే ఇంటికే సరఫరా చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో సొసైటీల పాలకవర్గాలు తమకు కావాల్సిన వారికే ఎరువులు ఇచ్చారనే ఆరోపణలున్నాయని, ప్రస్తుతం అలా జరిగితే కార్యదర్శులతోపాటు చైర్మన్లపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎరువుల కొరత రానీయకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలీసాగర్ ఎత్తిపోతల కింద నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా? అని కాంగ్రెస్ నాయకులను అడిగి తెలుసుకున్నారు.

కాంట్రాక్టర్‌ను పట్టుకురండి..

నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూంలను నిర్మించిన మహారాష్ట్రకు చెందిన కాంట్రాక్టర్ బిల్లులు డ్రా చేసుకుని పత్తాలేకుండా పోయాడని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఫలితంగా డబుల్ బెడ్‌రూంలు అసంపూర్తిగా మిగిలిపోయాయన్నారు. లబ్ధిదారులు మహారాష్ట్రకు వెళ్లి కాంట్రాక్టర్‌ను పట్టుకుని వచ్చి నిర్మాణాలను పూర్తి చేయించుకోవాలని సూచించారు. అవసరమైతే పోలీసుల మద్దతు తీసుకువాలన్నారు. తుంగిని గ్రామంలో సీసీ రోడ్డు పనులను నాసిరకంగా చేపట్టారని పీఆర్ ఏఈ శ్రావణ్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లుల చెల్లింపును నిలిపివేయాలని సూచించారు.

క్లుప్తంగా

ఉన్నత లక్ష్యంతో చదవాలి



ఎడపల్లి(బోధన్): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివితే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి అన్నారు. ఇందూర్ ఉమెన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఎడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు మీడియం పాఠశాల పదో తరగతి బాలికలకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం సందర్శన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని పొద్దుటూరి సదానంద్‌రెడ్డి ట్రస్టు వృద్ధాశ్రమాన్ని చేపూర్ క్షత్రియ పాఠశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వృద్ధులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మాక్లూర్: మండలంలోని వల్లభాపూర్‌లో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ మంజులాసుధాకర్ శనివారం ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ వాడలో మిగిలిపోయిన మెటల్‌రోడ్డును సీసీ రోడ్డుగా మార్చేందుకు ఎంపీ నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో కాంట్రాక్టర్ వై యాదగిరి, శిలారి సుధాకర్, పెద్ద గంగాధర్, గాంధీ, చింటు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



ఎడపల్లి(బోధన్): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి సంజయ్ బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. సుదర్శన్‌రెడ్డి ఆయనకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎడపల్లి మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, రామ్మోహన్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నవీన్, గ్రామ అధ్యక్షుడు రాజాగౌడ్, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు కొండ్ర రాములు, హన్మంత్ రెడ్డి, పరిగె సాయిలు, ఆయటి సాయిరెడ్డి, కొప్పుల సంతోష్‌రెడ్డి, మైనార్టీవిభాగం సెక్రెటరీ ఎజాజ్, అజ్జపు రవికుమార్, కుర్నాపల్లి గ్రామానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఆవుకు అంత్యక్రియలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ప్రాంతంలో శనివారం ఉదయం లారీ ఢీట్టడంతో ఆవు అక్కడిక్కడే మృతిచెందింది. స్థానికులు సమాచారం అందించడంతో సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, ఖాందేశ్ ప్రశాంత్, మందుల బాలు, ఉదయ్‌గౌడ్, లక్ష్మ పవన్, అంబదాస్ ఆవుకు సమీపంలోని స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆవులను గోశాలకు తరలించే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఎఫ్ఐఆర్ కాపీలు పొందిన ఉద్యమకారులు

నందిపేట్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరుగ్యారంటీల్లో తెలంగాణ ఉద్యమకారులకు సైతం లబ్ధి చేకూరనుండడంతో వారు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఉద్యమకాలంలో తమపై నమోదైన కేసుల ఎఫ్ఐఆర్ కాపీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం తీసుకున్నారు. దరఖాస్తులకు ఎఫ్ఐఆర్ కాపీలను జతచేశారు. ఎఫ్ఐఆర్ కాపీలు తీసుకున్న వారిలో జేఏసీ కన్వీనర్ గంగాధర్, సిలిండర్ లింగం, షౌకత్ భారీ, మజారుద్దీన్, ఆరుట్ల రమేశ్, బాలగంగాధర్, తమ్మల దేవేందర్, సమీర్, షాకీర్, బొడ్డు రాజశేఖర్, సయ్యద్, దారం సురేశ్, వీరేశ్, రాందాస్, మంద దేవన్న, రఫీక్ తదితరులున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మాక్లూర్: మండలంలోని మానిక్‌బండార్ శివారులో శుక్రవారం అర్ధరాత్రి పేకాటస్థావరంపై పోలీసులు దాడిచేశారు. రూ.19వేల నగదు స్వాధీనం చేసుకొని ఏడుగురు పేకాటరాయుళ్ల అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు.

బైపాస్‌రోడ్డు నిర్మించొద్దని ఎంపీకి వినతి


ఎంపీ అర్వింద్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ గ్రామం పక్కన వ్యవసాయ క్షేత్రాల నుంచి 63వ నంబరు జాతీయ రహదారి బైపాస్‌రోడ్డు నిర్మించవద్దని గ్రామస్తులు ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు శనివారం విన్నవించారు. ఎంపీని శనివారం జిల్లా కేంద్రంలో కలిశారు. గ్రామం మధ్యనుంచి మోర్తాడ్ వైపు ఉన్న జాతీయ రహదారిని వెడల్పు చేయాలని గ్రామస్తులు గ్రామపంచాయతీ ద్వారా చేసిన తీర్మాన ప్రతిని ఎంపీకి అందజేశారు. బైపాస్‌రోడ్డు నిర్మిస్తే విలువైన పంటలు పండే భూములను కోల్పోతామని అన్నారు. ప్రస్తుతం గ్రామం మధ్యనుంచి ఉన్న రోడ్డును విస్తరిస్తే నష్టం తక్కువగా ఉంటుందని ఎంపీకి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తుల తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న అసిస్టెంట్, అడిషనల్ పీపీలు


హాజరైన పోలీస్, అటవీశాఖ అధికారులు

బోధన్: శాంత్రిభద్రతల పరిక్షణ కోసం క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే పోలీస్ శాఖ అధికారులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోధన్ కోర్టు అసిస్టెంట్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు చిదిరాల రాణి, సమ్మయ్య, శ్యాంరావు సూచించారు. పట్టణంలోని కోర్టులో శనివారం డివిజన్ పరిధిలోని పోలీస్, అటవీ శాఖ అధికారులకు వివిధ చట్టాల పై శిక్షణ తరగతులు నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్సైలు వీరయ్య, శ్రీనివాస్‌రాజు, కృష్ణకుమార్, నాగ్‌నాథ్, ఉదయ్‌కుమార్, రాజు, ఫారెస్ట్ అధికారులు శ్రీదేవి, లక్ష్మీనారాయణ, రాజేందర్, బాలకృష్ణ, వినయ్‌కుమార్, సయ్యద్ సాబేర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్షత్రీయసమాజ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ

ఆర్మూర్‌టౌన్/బాల్కొండ: టీచర్స్ యూనియన్‌ల, క్షత్రీయ సమాజ్ నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం ఆవిష్కరించారు. ఆర్మూర్ పట్టణంలోని శ్రీలక్ష్మీనారాయణ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో క్షత్రీయ సమాజ్ క్యాలెండర్లను ఎంపీ అర్వింద్ ఆవిష్కరించారు. సమాజ్ అధ్యక్ష,కార్యదర్శు లు మదన్‌మోహన్, బారడ్ గంగామోహన్, సభ్యు లు శికారి రాజు, వైద్య సంజయ్, సాత్‌పుతే శ్రీనివాస్, బీజేపీ నాయకులు పల్లెగంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మెండోరలో యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంపీపీ సుకన్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజన్, ఎంపీడీవో శ్రీనివాస్ ఆవిష్కరించారు. ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మెండోరా మండల పరిషత్ కార్యాలయం వద్ద పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు


తొండాకూర్‌లో శోభాయాత్ర


జానకంపేటలో ఇంటింటికీ అక్షింతల పంపిణీ

సాక్షి నెట్‌వర్క్: అయోధ్య శ్రీరాముని అక్షింతలను శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. ఆర్మూర్ తహసీల్దార్ శ్రీకాంత్‌కు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు అక్షింతలను అందజేశారు. మాక్లూర్, డొంకేశ్వర్ బాల్కొండ, ముప్కాల్, మెండోరా, ఆలూర్, ఎడపల్లి మండల కేంద్రాలతోపాటు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో అక్షింతల కలశాలకు స్వాగతం పలికారు. రెంజల్ మండలం దండిగుట్టలో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. రామ నామ స్మరణతో గ్రామం మార్మోగింది.


రెంజల్ మండలం దండిగుట్టలో శోభాయాత్ర

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి సిద్ధం



బోధన్: రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉన్నామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సింగాడే పాండు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన నాయకులతో కలిసి మాట్లాడారు. గ్రామ గ్రామాన పార్టీ నిర్మాణం, పటిష్టత కోసం ముందుకు వెళ్తామన్నారు. భవిష్యత్‌లో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి గైని గంగాధర్, నాయకులు రాంచందర్, శంకర్, రామకృష్ణ, రెడ్డి సాయిలు, సాయికుమార్, సుభాష్, రవి కిరణ్, గంగాధర్, భూమేశ్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



బోధన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప దో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ప్రముఖ వ్యాపారవేత్త సురేశ్ ఇనానీ శనివారం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం కిశోర్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లలిత, సోషల్ వర్కర్ సనాపటేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్కొండలో పోలీసు పరేడ్



బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం బాల్కొండ, ముప్కాల్, మెండోరా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది పరేడ్ నిర్వహించారు. శాంతిభద్రతలను కాపాడటంలో తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బాల్కొండ, ముప్కాల్, మెండోరా ఎస్సైలు గోపి, భాస్కరాచారి, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తుల వెల్లువ


రుద్రూర్‌లో కంప్యూటర్ ఆపరేటర్లతో మాట్లాడుతున్న డీపీవో జయసుధ

బోధన్‌టౌన్/ఎడపల్లి/రుద్రూర్: ఆరుగ్యారంటీల అమలు కోసం చేప ట్టిన ప్రజాపాలనలో దర ఖాస్తులు భారీ సంఖ్యలో అందాయి. బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని 38 వార్డుల్లో 21,904 ధరఖాస్తులందినట్లు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. ఎడపల్లి మండలంలోని 17 గ్రామాల్లో 11,743 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో గోపాలకృష్ణ తెలిపారు. రుద్రూర్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రకియను శనివారం జిల్లా పంచాయతీ అధికారి జయసుధ పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా డీపీవో సందర్శించారు. ఆన్‌లైన్ ప్రకియను సకాలంలో పూర్తి పూర్తి చేయాలని సూచించారు. డీపీవో వెంట మండల అభివృద్ధి అధికారి బాలగంగాధర్, రుద్రూర్ జీపీ కార్యదర్శి గంగాధర్ ఉన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీ అర్వింద్


నెహ్రూనగర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు


పిప్రిలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

పెర్కిట్(ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆర్మూర్ మండలం పిప్రిలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాల దరఖాస్తులను స్వీకరించేందుకు అధికారులే గ్రామాలకు వస్తారన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ఆవాస్ యోజన, సుకన్య సమృద్ధియోజన పథకాలతోపాటు బీమా పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకుడు పల్లె గంగారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, సర్పంచ్ ఆసపురం దేవి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో..

బాల్కొండ : కేంద్ర ప్రభుత్వ పథకాలపై మెండోరా మండలం నెహ్రూనగర్ గ్రామస్తులకు పోచంపాడ్ ప్రాథమిక కేంద్ర వైద్యాధికారి రాకేశ్ అవగాహన కల్పించారు. ఏపీఎం విక్రమ్, మహిళా సమాఖ్య సభ్యులు, ఆశవర్కర్లు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి వేముల దీప్తి

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆర్మూర్ కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఏర్గట్ల రాజుబాయి ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమానికి న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు 18 సంవత్సరాలు నిండే వరకు వాహనాలను నడుపొద్దని, అలాగే మాదకద్రవ్యాలకు అలావాటు కావొద్దని సూచించారు. చదువులోనే ఆనందం పొందే ప్రయత్నం చేస్తే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఏర్గట్ల పోచన్న, వినోద్ కుమార్, నవ్యశ్రీ, పాఠశాల హెచ్‌ఎం చేతనకుమారి, సర్పంచ్ సాయన్న, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, పోలీస్ అధికారి మీనుగు రాజేశ్వర్, కోర్టు సూపరింటెండెంట్ రమేశ్, జర్నలిస్టు కొండవీటి శ్యామ్‌ప్రసాద్, న్యాయవాది చరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలి

బాల్కొండ: క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలని డీసీసీబీ డైరెక్టర శేఖర్‌రెడ్డి అన్నారు. అండర్-20 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే బాలబాలికల జట్లకు మెండోరా మండలం బుస్సాపూర్‌లో శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 11 నుంచి సిద్దిపేట్ జిల్లా గజ్వేల్‌లో రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించబడుతుందన్నారు. శిక్షణ శిబిరం ఏర్పా టు చేసిన దాత ఏలేటి శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు. సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ నడ్పి సాయన్న, ఉపసర్పంచ్ గంగారెడ్డి, కబడ్డీ క్రీడాకారుడు గంగాధర్ పాల్గొన్నారు.


క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

మహిళల సమస్యలపై అవగాహన


మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ ధర్మేందర్

బోధన్: వర్డ్ (ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బోధన్ మండలం సంగం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళ, ఆరోగ్య సంబంధిత అంశాలపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. వర్డ్ సంస్థ ట్రెనింగ్ కో ఆర్డినేటర్ ధర్మేందర్.. హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ జాగ్రత్తలు, గృహ హింస, మహిళలపై జరిగే హింస, కిశోర బాలబాలికలకు సంబంధించిన చట్టాలపై మాట్లాడారు. ఉపసర్పంచ్ శంకర్, గ్రామ పెద్దలు కె.గంగారెడ్డి, వర్డ్ సంస్థ కమ్యూనిటీ కో ఆర్డినేటర్ కూర చంద్రశేఖర్, అంగన్‌వాడీ టీచర్లు రాధిక, సలీమా, ఆశ వర్కర్ సునీత, ఐకేపీ వీవోఏ నాగయ్య, సంతోషి, సీసీ సాయికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫ్రిడ్జ్ వితరణ



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానానికి మండల కేంద్రానికి చెందిన దుబాయ్ శ్రీను శనివారం ఫ్రిడ్జ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెరిక నాగన్న, తోట రాజేశ్వర్, బండారి నర్సయ్య, శివ, రాజు, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్‌కు 17వ తేదీ తుదిగడువు

మోర్తాడ్(బాల్కొండ) : జిల్లావ్యాప్తంగా ప్రజాపాలనలో భాగంగా సేకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు 17వ తేదీని తుదిగడువుగా ఖరారు చేశారు. మండల పరిషత్, రెవెన్యూ, సెర్ప్, ఉపాధి హామీ కార్యాలయాలతోపాటు మున్సిపాలిటీల్లోనూ ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేయడానికి ప్రజాపాలన చివరి రోజైన శనివారం రోజే ఆరంభించారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు అవసరమైన చోట కొత్తవారిని తాత్కాలిక ప్రాతిపదికన ఆపరేటర్లుగా నియమించారు. ఒక్కో మండలంలో దరఖాస్తుల సంఖ్య, జనాభా ఆధారంగా 20 నుంచి 25 కంప్యూటర్లను ఏర్పాటు చేశారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – డెవిల్ (తెలుగు)-10.05, 7.00
రాఘవరెడ్డి (తెలుగు) - 4.15
సలార్ (హిందీ)- 10.10

స్క్రీన్-2 – సలార్ (తెలుగు)- 11.00, 2.35, 6.10, 9.45

స్క్రీన్-3 – హాయ్‌నాన్న- 12.20, 6.45, 10.00, డెవిల్ (తెలుగు) - 3.35